కాంగ్రెస్ విజయం

- ఉమ్మడి జిల్లాలో 10 స్థానాల్లో గెలుపు
- మెరుగైన ఫలితాలపై శ్రేణుల్లో ఫుల్ జోష్

కౌంటింగ్ కోసం భద్రపర్చిన ఈవీఎంలు తీసుకొస్తున్న సిబ్బంది

ఓట్ల కౌంటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది

అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తాళం తీస్తున్న సిబ్బంది

పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

బ్యాలెట్ పేపర్ల లెక్కింపు..

కౌంటింగ్‌కు ముందు బ్యాలెట్ బాక్స్‌ను చూపిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 10 స్థానాలను కైవసం చేసుకున్నది. బీఆర్ఎస్ పార్టీ జోగుళాంబ గద్వాల జిల్లాలోని రెండు స్థానాలను కైవసం చేసుకున్నది. ఆదివారం మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. గెలిచిన అభ్యర్థులకు ఆయా రిటర్నింగ్ అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్‌గౌడ్, వనపర్తిలో నిరంజన్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్ నుంచి జంప్ అయిన జూపల్లి కృష్ణారావు, కశిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున గెలుపొందారు. అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి, వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థి తుడి మేఘారెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కశిరెడ్డి నారాయణరెడ్డి, మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి రాజేశ్‌రెడ్డి గెలుపొంది శాసనసభలో అడుగు పెట్టనున్నారు. కాగా, వనపర్తిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కాన్వాయ్‌పై కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసిరడంతో కారు ధ్వంసమైంది. పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డి సోదరుడి కారుపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండుకు రెండు స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకోవడంతో ఆ జిల్లాలో గులాబీ జోష్ నెలకొన్నది. అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

'పది'స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం..

మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడుస్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నది. మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై 16,992 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శ్రీనివాస్‌రెడ్డికి 84,728 ఓట్లు రాగా శ్రీనివాస్‌గౌడ్‌కు 67,736 ఓట్లు వచ్చాయి. జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి లక్ష్మారెడ్డిపై 15,333 మెజార్టీతో విజయం సాధించారు. అనిరుధ్‌రెడ్డికి 90,145 ఓట్లు రాగా లక్ష్మారెడ్డికి 75,515 ఓట్లు వచ్చాయి. దేవరకద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై విజయం సాధించారు. మధుసూదన్‌రెడ్డికి 87,909 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆలకు 87,002 ఓట్లు వచ్చాయి. ఇక నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,525 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శ్రీహరికి 74,917 ఓట్లు రాగా చిట్టెంకు 57,392 ఓట్లు వచ్చాయి. పేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్‌రె డ్డిపై 7,506 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పర్ణికకు 84,005 ఓట్లు రాగా రాజేందర్‌రెడ్డికి 76,499 ఓట్లు వచ్చాయి. నాగర్‌కర్నూలు జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డిపై 28,988 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జూపల్లికి 91,853 ఓట్లు రాగా బీరానికి 62,872 ఓట్లు వచ్చాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజేశ్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి జనార్దన్‌రెడ్డిపై 5,371 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజేశ్‌రెడ్డికి 86,198 ఓట్లు రాగా మర్రికి 80,827 ఓట్లు వచ్చాయి. అచ్చంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ తన సమీప ప్రత్యర్థి గువ్వల బాలరాజుపై 49,326 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వంశీకృష్ణకు 1,13,761 ఓట్లు రాగా గువ్వలకు 65,661 ఓట్లు వచ్చాయి. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కశిరెడ్డి నారాయణరెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారిపై 5,410 ఓట్లతో గెలుపొందారు. కశిరెడ్డికి 75,858 ఓట్లు రాగా తల్లోజు ఆచారికి 70,448 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొన్నది.

గద్వాలలో గులాబీ గుబాలింపు

జోగులాంబ గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఈ జిల్లాలోని లను క్లీన్ స్వీప్ చేసి గులాబీ సత్తా చాటింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపు ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి నిరాశజనకంగా మారాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామరెడ్డి ఒంటిచేత్తో అలంపూర్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించారు. రాజకీయాలకు కొత్త వ్యక్తి అయిన విజయుడిని చివరి నిమిషంలో తెరపైకి తెచ్చి కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విజయుడు తన సమీప ప్రత్యర్థి సంపత్‌కుమార్‌పై 30,573 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడికి లక్షా 370 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థికి 72,550 ఓట్లు వచ్చాయి. గద్వాల నియోజకవర్గంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రెండోసారి ఘన విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బండ్ల తన సమీప ప్రత్యర్థి సరితపై 7,036 ఓట్ల తేడాతో గెలుపొందారు. కృష్ణమోహన్‌రెడ్డికి 94,097 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి సరితకు 87,061 ఓట్లు వచ్చాయి.

ఇది ప్రజల గెలుపు

- సంక్షేమ పథకాలే గెలిపించాయి
- కేసీఆర్ వెన్నంటే ఉంటా
- కర్ణాటక వైఫల్యాలే నడిగడ్డలో కాంగ్రెస్ పతనానికి కారణం
- గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గెలుపుతో నాయకుల సంబురాలు

బీఆర్ఎస్ జెండాతో యువకుడి ఆనందోత్సాహం

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భుజాలపై ఎత్తుకొని ఊరేగిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల, డిసెంబర్ 3 : ''నా పై నమ్మకం ఉంచి గద్వాల నియోజకవర్గ ప్రజలు రెండోసారి ఎమ్మెల్యేగా ఆదరించారు. ఇది ప్రజా విజయం'' అని గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలే తన గెలుపునకు నాంది పలికాయన్నారు. కష్టకాలంలోనూ కేసీఆర్ వెన్నంటి ఉంటానని చెప్పారు. నడిగడ్డ కర్ణాటక సరిహద్దులో ఉండడం వల్ల అక్కడి కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన ప్రజలు ఇక్కడ కాంగ్రెస్‌ను ఆదరించలేదని చెప్పారు. కర్ణాటక రైతులే స్వయంగా ఇక్కడికి వచ్చి వారి కష్టాలను తెలియజేయడం వల్ల నడిగడ్డ ప్రజలు కాంగ్రెస్ హామీలను నమ్మలేదన్నారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అభ్యర్థి స్థానికేతరులు కాబట్టి ఇక్కడి ఓటర్లు ఆమెకు ఓటుతో సమాధానం చెప్పారన్నారు. తనను గెలిపించినందుకు ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. గద్వాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని చెప్పారు. ఈ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సరిచేసుకుంటూ ముందుకు సాగుతానని, గద్వాల ప్రజల ఆదరాభిమానాలు ఎల్లపుడూ తనపై ఇలాగే ఉండాలని కృష్ణమోహన్‌రెడ్డి కోరారు.

స్వల్ప తేడాతో హస్తగతం..

- నడిగడ్డలో బీఆర్ఎస్ హవా
- గద్వాలలో కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్‌లో విజయుడి విజయం
- సంబురాల్లో పార్టీ క్యాడర్
- పటాకులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుతూ..

- 5,371 ఓట్లతో విజయం సాధించిన రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి విజయం సాధించారు. నాగర్‌కర్నూల్‌లోని మార్కెట్‌యార్డులో ఆదివారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో రాజేశ్‌రెడ్డి సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డిపై 5,371 ఓట్ల తేడాతో గెలుపొందారు. ప్రచారం ప్రారంభం నుంచి ఉన్న ఉత్కంఠ చివరి రౌండ్ ఫలితాల వరకు కొనసాగింది. జనసేన అభ్యర్థి వంగా లక్ష్మణ్‌గౌడ్, బీఎస్పీ అభ్యర్థి కుమార్ తమ ఉనికిని చాటుకోలేకపోయారు. తిమ్మాజిపేటలో మర్రికి ఆధిక్యం రాగా బిజినేపల్లిలో కాంగ్రెసుకు వచ్చింది. నాగర్‌కర్నూల్ టౌన్, రూరల్‌లోనూ రాజేశ్‌రెడ్డికి మంచి ఆధిక్యం రాగా తెలకపల్లిలో 6వేల మెజార్టీ రావడంతో కాంగ్రెస్ విజయం దాదాపు ఖాయమైంది. చివరికి 5,371ఓట్లతో రాజేశ్‌రెడ్డి గెలుపొందినట్టు జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు మిన్నంటాయి. మాజీ మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన జూపల్లి కృష్ణారావును కలిసిన రాజేశ్‌రెడ్డి ఒకరి నొకరు అభినందించుకున్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా వేలాదిమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడళ్లలో పటాకులు కాల్చుతూ, డ్యాన్సులు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. ఈక్రమంలో తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇది ప్రజా విజయం : రాజేశ్‌రెడ్డి

కాంగ్రెస్ గెలుపు ప్రజల విజయమని రాజేశ్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతోపాటు మ్యానిఫెస్టోను వందశాతం అమలు చేసి మంచి పాలన అందిస్తామన్నారు. తన తండ్రి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అడుగుజాడల్లో ప్రజలకు సేవ చేస్తానన్నారు. ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంటానన్నారు. వైద్యుడిగా సేవ లందించిన తాను ప్రజా సేవకుడిగా పని చేస్తానన్నారు.

వనపర్తిలో కాంగ్రెస్ విజయం

- మేఘారెడ్డికి పట్టంకట్టిన ప్రజలు
- 24,200ఓట్ల మెజార్టీ
- ఉనికి చాటుకున్న బీజేపీ
- ప్రజల తీర్పును శిరసావహిస్తాం: సింగిరెడ్డి

వనపర్తి డిసెంబర్ 3, (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. రెండ్రోజులుగా ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూసిన క్షణాలకు ఆదివారం కౌంటింగ్‌తో తెరపడింది. నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్ జేజీస్ నందలాల్ పవార్ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్‌ను కొనసాగించారు. ఉదయం 8:30 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయింత్రం ముగిసింది. 22 రౌండ్ల ద్వారా ఫలితాలు వెలువడ్డాయి. మొదటి రౌండ్‌లో బీఆర్ఎస్‌కు కొద్దిపాటి మెజార్టీ రాగా, మినీతా రౌండ్లలో కాంగ్రెస్ పార్టీకే మెజార్టీ వచ్చింది. మొత్తం 2,10,739 ఓట్లు పోలింగ్ కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి 1,05,469 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి 81,269 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి అనుజ్జారెడ్డికి 9,034 ఓట్లు వచ్చాయి. బీఎస్పీకి 3,935, ఏఏపీఆర్ పార్టీకి 2,390, ధర్మ సమాజ్ పార్టీకి 1,256 ఓట్లు వచ్చాయి. కాగా స్వతంత్ర అభ్యర్థులు రజినీకాంత్‌కు 2,143, కాట్రావత్ రాములుకు 2,012 ఓట్లు వచ్చాయి. మిగిలిన స్వతంత్రులకు 150 నుంచి 400లోపు ఓట్లు వచ్చాయి. మొత్తం 13మంది పోటీ చేయగా నోటాకు 1,928 ఓట్లు వచ్చాయి.

ప్రజల తీర్పును శిరసావహిస్తా : బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదేనని, అందుకు ప్రతిఒక్కరూ కట్టుబడాలన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా గడిచిన అయిదేండ్లు నిర్విరామంగా ప్రజల కోసమే పని చేశానన్నారు. అయినప్పటికీ ప్రజల విశ్వాసం అభివృద్ధి వైపు నడవలేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలే అత్యంత మెజార్టీ ఇచ్చి గెలిపించారని, అందుకు తగ్గట్టుగా పని చేశానన్నారు. మళ్లీ అవకాశం ఇవ్వకపోయినా ప్రజల మధ్యనే ఉంటూ వారి కోసమే పని చేస్తానన్నారు.

గులాబీ గుబాళింపు

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతో నాయకుల సంబురాలు



ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని సన్మానిస్తున్న నాయకులు

గద్వాల, డిసెంబర్ 3 : నడిగడ్డపై గులాబీ జెండా రెపరెపలాడింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే ఇక్కడి ఇద్దరి అభ్యర్థులను గెలిపించింది. రెండోసారి కృష్ణమోహన్‌రెడ్డి గెలిచి గద్వాల కోటపై గులాబీ జెండా ఎగురవేశారు. చివరి వరకు ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో చివరికి కృష్ణమోహన్‌రెడ్డిని విజయం వరించింది. 2018లో మొదటిసారి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణపై మొదటిసారిగా కృష్ణమోహన్‌రెడ్డి 28,445మెజార్టీతో గెలిచారు. అదే స్ఫూర్తితో నిరంతరం ప్రజల మధ్య ఉండడంతో ప్రజలే ఆయనకు రెండోసారి పట్టం కట్టారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సరితపై 7,681 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గద్వాల నియోజకవర్గంలో సరిత బహుజన వాదం ఎత్తుకొని బీసీలను ఆకట్టుకునే ప్రయత్నం చేసినా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఇతర పార్టీల నుండి బరిలో నిలవడంతో ఆమె ఓటమి చెందింది. బోయసామాజిక వర్గానికి చెందిన శివారెడ్డి బీజేపీ తరఫున పోటీ చేయగా కేవలం 7,422 ఓట్లు మాత్రమే సాధించారు. కురుమ సామాజిక వర్గానికి చెంది రంజిత్‌కుమార్ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీ చేసిన రంజిత్‌కుమార్ బీసీ సామాజికవర్గానికి చెందిన ఓట్లు చీల్చడం సరిత ఓటమికి కారణమైంది. కాగా ఇక్కడి బీజేపీ అభ్యర్థి నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏఐఎఫ్ నుంచి బరిలో నిలిచిన రంజిత్‌కుమార్‌కు 13,429 ఓట్లు వచ్చి మూడోస్థానంలో నిలిచారు. గద్వాల కోటపై రెండోసారి గులబీ జెండా ఎగరడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో సంబురం నెలకొంది.

అలంపూర్‌లో చల్లా మార్క్..

అలంపూర్‌లో మరోసారి చల్లా తన మార్క్‌ను నిరూపించుకున్నాడు. చివరి వరకు టికెట్ విషయంలో ఉత్కంఠ నెలకొనగా ఎమ్మెల్సీ చల్లా బలపర్చిన విజయుడికి అధిష్ఠానం బీఫారం ఇవ్వడం, ప్రచారానికి కొద్ది రోజులే సమయం ఉన్నప్పటికీ చల్లానే స్వయంగా గ్రామాల్లో తిరుగుతూ అందరినీ ఏకం చేశారు. దీంతో విజయం బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడిని వరించింది. అలంపూర్ నియోజకవర్గంలో మొదటి నుంచి చల్లా ఎవరికి మద్దతుగా నిలిస్తే వారిదే విజయమని అలంపూర్ ప్రజలకు పూర్తి నమ్మకం. ఇప్పటికే సంపత్‌కుమార్‌ను ఒకసారి, అబ్రహంను ఒకసారి గెలిపించిన చల్లా మూడోసారి సామాన్యుడిని బరిలో నిలిపి నియోజకవర్గంలో తనమార్క్‌ను చాటుకున్నాడు. అలంపూర్ అంటే చల్లా, చల్లా అంటే అలంపూర్ అనే ప్రజల నమ్మకాన్ని మరోసారి నిలబెట్టుకున్నాడు. రాష్ట్ర మంతా కాంగ్రెస్ గాలి వీచినా నడిగడ్డలోని రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడంతో ఇక్కడి బీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొన్నది. బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌పై 30,573 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

గులాబీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు